


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి ఎడిటర్ - గడ్డమీది బాలరాజు బుధవారం 10-12-2025 సంపుటి - 26 సంచిక -203 రూ : 4 పేజీలు: 8




2లో

## చిరంజీవి, జెనీలియా సహా సినీ ప్రముఖులతో సీఎం భేటీ

- గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా సినీ ప్రముఖులతో ముఖ్యమంత్రి సమావేశం
- భేటీలో పాల్గొన్న చిరంజీవి, జెనీలియా, అమల, అల్లు అరవింద్, దిల్ రాజు
- స్క్రిప్ట్‌తో వచ్చి సినిమాలు పూర్తి చేసుకుని వెళ్లాలని వ్యాఖ్య

## తిరుమలలో ఏఐ టెక్నాలజీ..

* శ్రీవారి దర్శనం ఇక మరింత సులభం
* తిరుమలలో అందుబాటులోకి ఏఐ ఆధారిత ఐసీసీసీ కేంద్రం
* శ్రీవారి భక్తుల దర్శన సమయాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం



2లో



2లో

## రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

* ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు
* 33 జిల్లాల కోసం రూ. 5.80 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
* గ్లోబల్ సమ్మిట్ వేదికగా విగ్రహాలను వర్చువల్ గా ఆవిష్కరించిన సీఎం రేవంత్

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత భారీ పెట్టుబడి..

**సత్య నాదెళ్ల కీలక ప్రకటన**

- భారత్‌లో రూ.1.5 లక్షల కోట్ల భారీ పెట్టుబడి ప్రకటించిన మైక్రోసాఫ్ట్
- ప్రధాని మోదీతో భేటీ అనంతరం సీఈఓ సత్య నాదెళ్ల వెల్లడి
- ఆసియాలోనే ఇదే అతిపెద్ద పెట్టుబడి అని ప్రకటన
- ఏఐ మౌలిక వసతులు, నైపుణ్యాల అభివృద్ధికి ఈ నిధులు



2లో




2లో

## అక్కడకు వెళ్లవద్దు

### అయ్యప్ప భక్తులకు కేరళ అటవీ అధికారుల కీలక సూచన

- ఉరళ్‌కుళ జలపాదాన్ని సందర్శించవద్దని సూచన
- వన్యప్రాణుల దాడులు, తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న అధికారులు
- భక్తుల భద్రత దృష్ట్యా సన్నిధానం సూచన జారీ చేసిన స్పెషల్ డ్యూటీ రేంజ్ ఆఫీసర్



2లో

## స్థానిక సంస్థల ఎన్నికలు.. తెలంగాణలో స్కూళ్లకు 6 రోజుల సెలవు

- తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు
- తొలి, మూడో విడత పోలింగ్ కారణంగా నాలుగు రోజుల సెలవులు
- రెండో విడత పోలింగ్ వారాంతంలో రావడంతో కలిసి వచ్చిన సెలవులు

## స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్..

### కట్టడికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

- రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాప్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- అధ్యయనం కోసం జాతీయ స్థాయి నిపుణులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సీఎం ఆదేశం
- రాష్ట్రంలో 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు, చిత్తూరులో అత్యధికం
- సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గుముఖం పట్టాయని తెలిపిన అధికారులు
- అపరిశుభ్రతే అసలు జబ్బని, ప్రజల్లో చైతన్యం పెంచాలని సీఎం సూచన



2లో



2లో

## రేవంత్ రెడ్డి లక్ష్యాలు విన్నాక చైర్మన్ పదవిని తిరస్కరించలేకపోయా

- స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని రేవంత్ రెడ్డి కోరితే మొదట కుదరదని చెప్పానని వెల్లడి
- ఆయన విజన్ విన్నాక విజ్ఞప్తిని తిరస్కరించలేకపోయానన్న ఆనంద్ మహీంద్రా
- తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్

# స్క్రబ్ టైఫస్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్... కట్టడికి సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

అమరావతి, డిసెంబర్ 09 : రాష్ట్రంలో ఆందోళన కలిగిస్తున్న స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణకు, దానిపై సమగ్ర అధ్యయనం చేసేందుకు జాతీయ స్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అపరిశుభ్రతే అనేక వ్యాధులకు మూలకారణమని, ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత చైతన్యం తీసుకురావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రతపై అధికారులు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,592 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని, అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, ఈ వ్యాధి కారణంగానే మరణాలు సంభవించినట్లు ఇప్పటివరకు ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనుమానిత మరణాలుగా నమోదైన 9 కేసులను పరిశీలించగా, ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగానే వారు మరణించినట్లు తేలిందని వివరించారు. స్క్రబ్ టైఫస్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేసుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 8వ స్థానంలో ఉందని, తమిళనాడు, ఒడిశాలలో ఏకంగా 7 వేలకు పైగా కేసులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నివేదికపై స్పందించిన ముఖ్యమంత్రి, స్క్రబ్ టైఫస్‌ను తేలికగా తీసుకోవద్దని హెచ్చరించారు. తక్షణమే జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను విశ్లేషించి, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ నివేదిక ఆధారంగా పటిష్ఠమైన కార్యాచరణ అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు.

*** సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గుముఖం**

గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంచడం వంటి కారణాలతో మొత్తం సీజనల్ వ్యాధులు 48 శాతం తగ్గాయని తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు 56 శాతం, చికున్‌గున్యా 46.5 శాతం, మలేరియా 11 శాతం మేర తగ్గాయని వివరించారు. పరిశుభ్రతను పెంచడం ద్వారా సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశుభ్రతేనని, దానిపై యుద్ధం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా తదితరులు పాల్గొన్నారు.

## అక్కడకు వెళ్లవద్దు: అయ్యప్ప భక్తులకు కేరళ అటవీ అధికారుల కీలక సూచన

కేరళ, డిసెంబర్ 09 : శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే స్వాములు, భక్తులకు కేరళ అటవీ శాఖ అధికారులు ముఖ్యమైన సూచనలు చేశారు. వన్యప్రాణుల దాడులు, ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నందున ఆలయం సమీపంలోని ఉరల్‌కుళి జలపాతాన్ని సందర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు, ఆ ప్రాంతంలోని భద్రతా సమస్యలను దృష్టిలో ఉంచుకుని, భక్తుల భద్రత దృష్ట్యా సన్నిధానం స్పెషల్ డ్యూటీ రేంజ్ ఆఫీసర్ అరవింద్ బాలకృష్ణన్ ఈ సూచనలు జారీ చేశారు. అయ్యప్ప సన్నిధానానికి అటవీ మార్గం గుండా వెళ్లే కొందరు భక్తులు ఉరల్‌కుళి జలపాతం వద్ద స్నానం చేసి స్వామిని దర్శించుకోవడానికి వెళుతున్నారని బాలకృష్ణన్ తెలిపారు. పండితవాళనికి సుమారు 400 మీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం వద్ద ఇటీవల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం ఈ ప్రాంతంలోకి ప్రవేశం పూర్తిగా నిషేధించబడిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపు సంచరిస్తూ ఉంటుందని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ జలపాతానికి దూరంగా ఉండాలని భక్తులకు సూచించారు. జలపాతానికి వెళ్లే మార్గం జారే స్వభావం కలిగి ఉండటం వల్ల తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కాబట్టి, శబరిమల వచ్చే భక్తులు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## భారత్‌లో మైక్రోసాఫ్ట్ అత్యంత భారీ పెట్టుబడి... సత్య నాదెళ్ల కీలక ప్రకటన

ఢిల్లీ, డిసెంబర్ 09 : ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారత్‌లో అత్యంత భారీ పెట్టుబడికి సిద్ధమైంది. దేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాన్ని బలోపేతం చేసేందుకు ఏకంగా రూ.1.5 లక్షల కోట్లు (17.5 బిలియన్ డాలర్లు) పెట్టుబడిగా పెట్టనున్నట్లు ప్రకటించింది. మంగళవారం నాడు ప్రధాని నరేంద్ర మోదీతో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదేనని సత్య నాదెళ్ల తెలిపారు. రానున్న నాలుగేళ్లలో (20262029) ఈ నిధులను వెచ్చించనున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ పెట్టుబడి ద్వారా భారత్‌లో ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తామని ఆయన వివరించారు. ఈ సమావేశంపై సత్య నాదెళ్ల ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "భారత్ ఏఐ అవకాశాలపై ప్రధాని మోదీతో స్ఫూర్తిదాయకమైన చర్చ జరిగింది. దేశ ఆశయాలకు మద్దతుగా ఈ పెట్టుబడి పెడుతున్నాం" అని పేర్కొన్నారు. ఈ ప్రకటనపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ఏఐ విషయంలో ప్రపంచం భారత్ వైపు ఆశాభావంతో చూస్తోంది. సత్య నాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడికి భారత్‌ను ఎంచుకోవడం సంతోషకరం" అని మోదీ తన పోస్ట్‌లో తెలిపారు. దేశ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ఏఐ శక్తిని సృజనాత్మకంగా వినియోగించుకుంటుందన్న విశ్వాసాన్ని ప్రధాని వ్యక్తం చేశారు. ఇప్పటికే భారత్‌లో హైదరాబాద్, పుణే వంటి నగరాల్లో బలమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ తాజా పెట్టుబడి... దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, స్టార్టప్‌లకు భారీ ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## రేవంత్ రెడ్డి లక్ష్యాలు విన్నాక ఛైర్మన్ పదవిని తిరస్కరించలేకపోయా

హైదరాబాద్, డిసెంబర్ 09 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాలు, విజన్‌ను విన్న తర్వాత స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలనే ఆయన విజ్ఞప్తిని తిరస్కరించలేకపోయానని మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, సినీ నటుడు చిరంజీవి, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ, దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను రూపొందించారని ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు ఆయన అభినందనలు తెలిపారు. స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని ముఖ్యమంత్రి తనను అడిగారని గుర్తు చేసుకున్నారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున కుదరదని చెప్పానని, కానీ ఆయన విజన్ విన్నాక అంగీకరించినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశానని, ప్రజలనే కేంద్రంగా చేసుకుని దీనిని రూపొందించారని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం గొప్ప అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. దేశంలోనే వృద్ధి రేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉందని, నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉందని అన్నారు. దేశంలోనే వృద్ధి రేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని సుబ్బారావు వెల్లడించారు. ప్రతి సంవత్సరం 89 శాతం వృద్ధి సాధిస్తే తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదని అన్నారు. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుందని గుర్తు చేశారు. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదని, అన్‌బీటబుల్ కూడా అని పేర్కొన్నారు.

## పాక్‌లో చెక్‌పోస్ట్‌పై ఉగ్రదాడి..
# ఆరుగురు సైనికులు మృతి

పాకిస్థాన్, డిసెంబర్ 09 : పాకిస్థాన్‌లోని వాయవ్య ప్రాంతంలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కుర్రం జిల్లాలో ఉన్న ఓ సెక్యూరిటీ చెక్‌పోస్ట్‌పై సాయుధుల బృందం దాడి చేసింది. నిన్న రాత్రి జరిగిన ఈ ఘటనలో ఆరుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య తీవ్రస్థాయిలో కాల్పులు జరిగాయని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు కూడా హతమయ్యారని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొంది. ఈ దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్లు పాకిస్థాన్ తాలిబన్ (టీటీపీ) ప్రకటించింది. గత కొన్నేళ్లుగా పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో టీటీపీ దాడులు పెరిగాయి. వీరికి ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్ ఖండిస్తోంది. ఇది పాకిస్థాన్ అంతర్గత భద్రతా సమస్య అని స్పష్టం చేస్తోంది. ఇటీవలే ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఖతార్, టర్కీ, సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చల్లారడం లేదు. తరచూ కాల్పుల ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆఫ్ఘన్ శరణార్థులను పాకిస్థాన్ బలవంతంగా వెనక్కి పంపడం కూడా ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోస్తోంది.

## చిరంజీవి, జెనీలియా సహా సినీ ప్రముఖులతో సీఎం భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 09 : 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సినీ ప్రముఖులు చిరంజీవి, జెనీలియా, అమల, ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, సురేశ్ బాబు, దిల్ రాజు, పలువురు తెలుగు, హిందీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. స్క్రిప్ట్‌తో వచ్చి సినిమాలు పూర్తి చేసుకొని వెళ్లండి అని వారికి సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోల ఏర్పాటుకు సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. 24 క్రాఫ్ట్స్‌లో సినిమా పరిశ్రమ అవకాశాలకు అనుగుణంగా స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలించాలని సినీ ప్రముఖులకు ముఖ్యమంత్రి సూచించారు. కాగా, అంతకుముందు సినీ నటుడు చిరంజీవి ఆయనను కలిశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు..
# తెలంగాణలో స్కూళ్లకు 6 రోజుల సెలవు

హైదరాబాద్, డిసెంబర్ 09 : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండటంతో, ప్రభుత్వం పలు దఫాలుగా సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు ఆరు రోజుల పాటు విరామం దొరకనుంది. తొలి విడత పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్ల కోసం డిసెంబర్ 10, 11 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 13, 14 తేదీల్లో జరగనుండగా, ఆ రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో అవి సాధారణ సెలవులుగా కలిసివచ్చాయి. అనంతరం మూడో విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 16, 17 తేదీల్లో కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## తిరుమలలో ఏఐ టెక్నాలజీ..
# శ్రీవారి దర్శనం ఇక మరింత సులభం

తిరుమల, డిసెంబర్ 09 : శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఏ కంపార్ట్‌మెంట్‌లో భక్తులు ఎంతసేపటి నుంచి వేచి ఉన్నారనే వివరాలను ఏఐ టెక్నాలజీతో గుర్తిస్తారు. ఎక్కువసేపు నిరీక్షిస్తున్న వారికి ప్రాధాన్యతనిచ్చి, వారిని త్వరగా దర్శనానికి పంపేలా చర్యలు తీసుకుంటారని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ వివరించారు. భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి దర్శనం పూర్తయ్యే వరకు పూర్తి సమాచారం డాష్‌బోర్డులో కనిపిస్తుంది. దర్శనమే కాకుండా, అన్నప్రసాదాల వితరణను కూడా ఈ కేంద్రం సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఎంతమంది భక్తులకు అన్నప్రసాదం అందించారు, ఇంకా ఎంతమందికి అవసరం అనే వివరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తుంది. భద్రతను పెంచేందుకు 250 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను (FRC) కొనుగోలు చేయనున్నారు. నేర చరిత్ర ఉన్నవారి డేటాను దీనికి అనుసంధానం చేసి, అనుమానితులను సులువుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే తిరుమలకు వచ్చే వాహనాల సమాచారాన్ని పర్యవేక్షిస్తూ, కాలుష్య నియంత్రణకు పాత వాహనాలను నిలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.16 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.30 కోట్లకు చేరుతుందని అంచనా. ఏడుగురు దాతలు ఈ కేంద్రం నిర్మాణానికి సహకారం అందించారు. ఏడాది పాటు దీని నిర్వహణ బాధ్యతలను కూడా వారే చూసుకోనున్నారు. మొత్తం మీద భక్తులకు ఈ ఆధునిక సాంకేతికతతో తిరుమలలో పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది.

## రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించిన రేవంత్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 09 : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ లో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ వేదికగా ఈ విగ్రహాలను రేవంత్ వర్చువల్ గా ఆవిష్కరించారు. ఇందుకోసం ప్రభుత్వం మొత్తం రూ. 5.80 కోట్లు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు తెలంగాణ తల్లి విగ్రహాన్ని సంప్రదాయ పల్లెటూరి మహిళా రైతు రూపంలో తీర్చిదిద్దారు. పసుపుపచ్చ అంచుతో కూడిన ఆకుపచ్చ చీర, నుదుటన ఎర్రని బొట్టు, కాళ్లకు కడియాలు, ముక్కుపుడక, మట్టి గాజులు, గుండు పూసల హారంతో అలంకరించారు. ఎడమ చేతిలో మొక్కజొన్న, గోధుమ, సజ్జ కంకులు పట్టుకుని చిరునవ్వుతో కనిపించేలా విగ్రహాన్ని రూపొందించారు. భూమి నుంచి మొత్తం 18 అడుగుల ఎత్తులో (12 అడుగుల విగ్రహం, 6 అడుగుల దిమ్మె) ఈ విగ్రహం ఉండనుంది. ఒక్కో విగ్రహం తయారీకి సుమారు రూ.17.50 లక్షలు ఖర్చు చేశారు. డిసెంబర్ 9వ తేదీని "తెలంగాణ తల్లి దినోత్సవం"గా ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే నేడు విగ్రహాలను ఆవిష్కరించారు.

## రిజిస్ట్రేషన్ కాగానే ఆటో మ్యుటేషన్... రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

రాష్ట్రంలో రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. భూముల రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే, ఎలాంటి జాప్యం లేకుండా రియల్‌టైమ్‌లో ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ పూర్తయ్యేలా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాల కోసం భూ యజమానులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే దుస్థితికి చరమగీతం పాడాలని స్పష్టం చేశారు. రాబోయే ఏడాది కాలంలో రెవెన్యూ శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని, ఈ ప్రక్రియపై ప్రతినెలా తానే స్వయంగా సమీక్షిస్తానని ఆయన వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలపై అధికారులు సీఎంకు వివరించారు.

**ఆర్డీవోలకు కీలక అధికారాలు**

పరిపాలనలో సౌలభ్యం, వేగవంతమైన పరిష్కారం కోసం మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వివాదాస్పద భూముల జాబితా (డిస్ప్యూటెడ్ ల్యాండ్స్) నుంచి భూములను తొలగించే అధికారాన్ని ఇప్పటివరకు ఉన్న జాయింట్ కలెక్టర్ స్థాయి నుంచి ఆర్డీవోలకు బదలాయించాలని నిర్దేశించారు. అదేవిధంగా, '22ఏ' జాబితాలో ఉన్న భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు.

# మార్చి 14 నుంచి పది పరీక్షలు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 13న ముగుస్తాయి. పరీక్షల దస్త్రానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు పీవీ శ్రీహరి షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. గత విద్యా సంవత్సరం(202425) మాదిరిగా ఒక్కో సబ్జెక్టుకు 20 అంతర్గత మార్కులతో పాటు సబ్జెక్టుల వారీగా గ్రేడింగ్ ఇస్తారు.

**పునశ్చరణకు అవకాశం...**

సీబీఎస్ఈలో పది, ఇంటర్ పరీక్షలు ఒకేసారి నిర్వహిస్తారు. దాంతో ఒక్కో పరీక్ష మధ్య కనీసం నాలుగు నుంచి ఏడు రోజుల పాటు వ్యవధి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దఫా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు అదే తరహాలో షెడ్యూల్ జారీ చేసింది. దీనివల్ల చదువులో వెనకబడిన విద్యార్థులు కూడా పునశ్చరణ చేసుకొని కనీస మార్కులు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే పరీక్షల ముగింపు ఆలస్యమైనందున అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించేందుకు వీలుగా త్వరగా ఫలితాలను వెల్లడించాల్సి ఉంటుంది.

**పరీక్షల షెడ్యూలు (సబ్జెక్టు - పరీక్ష తేదీ)**

ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు మార్చి 14
సెకండ్ లాంగ్వేజ్ హిందీ మార్చి 18
థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ మార్చి 23
మ్యాథమెటిక్స్ మార్చి 28
ఫిజికల్ సైన్స్ ఏప్రిల్ 2
బయోలాజి ఏప్రిల్ 7
సోషల్ స్టడీస్ ఏప్రిల్ 13
ఓరియెంటల్ లాంగ్వేజ్ (పేపర్ 1) ఏప్రిల్ 15
ఓరియెంటల్ లాంగ్వేజ్ (పేపర్ 1) ఏప్రిల్ 16

# వామ్మో నెలరోజులా...!



*** పదవ తరగతి షెడ్యూల్ పై సర్వత్ర ఆవేదన**

(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ పై విద్యార్థుల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతుంది. నెల రోజులపాటు పరీక్ష టైం టేబుల్ చూసి అవాక్కవుతున్నారు. ఏడు పరీక్షలను నెల రోజులపాటు నిర్వహించే విధంగా షెడ్యూల్ ను ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి 13వ తేదీన మొదటి పరీక్ష మొదలవుతే ఏప్రిల్ 16వ తేదీన చివరి పరీక్ష ఉండనుంది. గతంలో 11 పేపర్లు ఉన్నప్పుడు 15 నుంచి 17 రోజుల వ్యవధిలో పరీక్షలు పూర్తయ్యేల షెడ్యూలు ఉండేది. కరోనా తర్వాత 11 పేపర్ల నుంచి ఏడు పేపర్లకు కుదించారు. అప్పటినుంచి ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్యన ఒకరోజు ఖాళీగా ఉంచారు. దీంతో గతంలో మాదిరిగా 15 నుంచి 17 రోజులలో పరీక్షలు పూర్తయ్యేలా చూశారు. ఇదే విధానానికి ఇప్పటివరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్నద్ధమవుతూ వచ్చారు. కానీ ఈ ఏడాది ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్యన నాలుగు నుంచి ఐదు రోజులపాటు ఖాళీ సమయం ఉండేలా షెడ్యూలు రూపొందించారు.




*** పరీక్షలపై ఆసక్తి తగ్గే ప్రమాదం అధికం**

ఒక పరీక్షకు మరోపరీక్ష కు మధ్యన ఖాళీ సమయం అధికంగా ఉండడంతో విద్యార్థులకు ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా రెండు రోజులకు ఎక్కువ సెలవులు వస్తేనే చదువు మీద శ్రద్ధ చూపని పిల్లలు ఐదు రోజులు సెలవులు ఉంటే పుస్తకాలపై ధ్యాసను పూర్తిగా వదిలేసే ప్రమాదం ఉందని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. నెలరోజుల పరీక్షా షెడ్యూల్ తో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం కూడా ఉంది. రోజు విడిచి రోజు పరీక్షలు ఉంటే విద్యార్థులకు పరీక్షల పై ఆసక్తి పెరిగి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మరింత కృషి చేసే అవకాశం ఉంటుందని నిపుణులు అంటున్నారు. పరీక్షా సమయంలో ఎక్కువ సెలవులు రావడం వల్ల అనాసక్తికి గురయ్యే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి.

*** ఇతర విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు**

పదవ తరగతి పరీక్షలు నెల రోజులపాటు సాగడం వల్ల ఇతర తరగతుల విద్యార్థులకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉండే పాఠశాల నిర్వహణ గందరగోళానికి గురవుతుంది. సాధారణంగా మార్చి 15 తర్వాత ఒంటిపూట బడులు మొదలవుతాయి. పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు ఒంటి పూట సమయంలో మధ్యాహ్నం ఇతర తరగతులకు పాఠశాలను నిర్వహిస్తూ వచ్చారు. ఇప్పుడు నెల రోజులపాటు షెడ్యూల్ ఉండడం వల్ల ఏడు పరీక్షలు ఉన్న రోజుల్లో మాత్రమే మధ్యాహ్న సమయంలో పాఠశాల నిర్వహించి మిగిలిన రోజుల్లో ఏ విధంగా తరగతులు పెట్టాలన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నామని పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని రకాల సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నప్పుడు ప్రభుత్వం ఈ రకమైన షెడ్యూల్ విడుదల చేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# అంగన్ వాడి కేంద్రం లో పలకల పంపిణీ



యాదాద్రి భువనగిరి ఆలేరు, ప్రజా స్ఫూర్తి: సోనియాగాంధీ 78వ పుట్టినరోజు సందర్భంగా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, బీర్ల ఐలయ్య, ఆలేరు కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ ఎం ఏ ఎజాస్ ఆదేశాల మేరకు వానరాశి మార్కు ఆధ్వర్యంలో రెండవ వార్డులోని అంగన్ వాడి కేంద్రంలో 50 మంది విద్యార్థులకు పలకల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి ఉపాధ్యాయురాలు లక్కాకుల ఝాన్సీ, కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, నీలం వెంకటస్వామి, ఎగ్గిడి శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ నాయకులు కంసాని మహేష్, సాయిరాం, రామ్, కాంగ్రెస్ నాయకులు మోతే వెంకటేష్, తిరుపతి, మల్లయ్య,దావీదు, కంసాని సుధాకర్, కంసాని సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పంచారు. సోనియా గాంధీ ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుద్దెడ భాను, సంగీతం శ్రీనాథ్ ఆర్టీవో నెంబర్ తోపాటు పలువురున్నారు.

# గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

**- బక్కతట్ల రాధిక శ్రీశైలం యాదవ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తూప్రాన్ పేట బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బక్కతట్ల రాధిక శ్రీశైలం యాదవ్ అన్నారు. చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట గ్రామంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రచారంలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా బక్కతట్ల రాధిక శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామ ప్రజల వస్తున్న ఆదరణ ఊహించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలు గుర్తుచేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల నుంచి మార్పు స్పష్టంగా కనిపిస్తుందని, అభివృద్ధి చేసిన పార్టీకే గ్రామంలో పట్టం కడతారన్నారు. తూప్రాన్ పేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. విద్యావంతురాలైన తనకు అవకాశం ఇచ్చి, సర్పంచ్ గా గెలిపించాలని కోరారు.




# జర్నలిస్టుల సమస్యల పై చిత్తశుద్ధితో పనిచేసే ఏకైక సంఘం ఫెడరేషన్

*** టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో కూడిన నిబద్ధతతో పనిచేసే ఏకైక సంఘం ఫెడరేషన్ అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ మండలంలోని సూరారం అంబేద్కర్ భవన్ లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మేడ్చల్‌మల్కాజ్ గిరి జిల్లా మూడవ మహాసభ ఘనంగా జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర కోకన్వీనర్ తన్నీరు శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన ఈ మహాసభలో మామిడి సోమయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల సాధనే ధ్యేయంగా ఏర్పడిన టీడబ్ల్యూజేఎఫ్ ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినది కాదనీ,ఏ ఒక్క రాజకీయ పార్టీకి,పత్రికకు అనుబంధం కాదని స్పష్టం చేశారు.జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల కనీస సమస్యలను ఈ నెలాఖరుగా పరిష్కరించకపోతే జనవరిలో "రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జనచైతన్య యాత్ర" నిర్వహించి, వందలాది మందితో ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఫెడరేషన్ లో జర్నలిస్టులందరికీ సమాన హక్కులు, బాధ్యతలున్నాయని చెప్పారు. ఈమధ్య కొంతమంది స్వార్థపరులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రలు పన్నుతున్నారని, సంఘం మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తుల పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నెంబర్ సంఘంగా ఎదుగుతున్న తరుణంలో కొందరు స్వార్థ పరులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్ర పన్నారని, ఆ కుట్రలో భాగంగానే బసవపున్నయ్య అనే వ్యక్తి సంఘాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నాడని మామిడి సోమయ్య మండిపడ్డారు. జర్నలిస్టుల జీవితాలను తాకట్టు పెట్టే విధంగా ఆయన వ్యవహార శైలి ఉందని ఆరోపించారు. ఎదుగుతున్న సంఘాన్ని తన చేష్టలతో వెనుక్కి నెట్టి సంఘం పరువు తీశాడని అన్నారు. ఫెడరేషన్ ఎంతోమంది జర్నలిస్టుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని,ఈనాడు ఒక మంచి సంఘంగా గుర్తింపు పొంది జర్నలిస్టుల సమస్యల పట్ల పోరాటం చేస్తూ, జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘంగా గుర్తింపు తెచ్చుకుందని అన్నారు. ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ కేంద్రం పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్నారు. రైల్వే రాయితీ పాసులను జర్నలిస్టులకు తిరిగి ఇవ్వాలని కోరారు. ఫెడరేషన్ కో కన్వీనర్ వల్లాల జగన్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు రక్షణ చట్టం తక్షణం అమలు చేయాలన్నారు. మరో కో కన్వీనర్ ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణ కార్యాచరణ ప్రకటించాలని నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక జర్నలిస్టుల సంక్షేమం కోసం తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మహాసభలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జెమినీ నాగరాజు గౌడ్, జగదీశ్వర్ గుప్తా, కుత్బుల్లాపూర్ కార్యదర్శి గోవింద రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివ,మాజీ సర్పంచ్ కావలి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యవర్గం**

టీడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్‌మల్కాజ్ గిరి జిల్లా మహాసభలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షులుగా కావలి మోహన్,మనం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా గడ్డమీది అశోక్, సహాయ కార్యదర్శులుగా శంకర్, సంతోష్ రెడ్డి, పర్వేజ్ అహ్మద్, సంయుక్త కార్యదర్శులుగా రమేష్, చిన్నబాబు,కోశాధికారిగా అమరేందర్ గౌడ్, జిల్లా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ గా బాల్ రాజ్ పటేల్,కార్యవర్గ సభ్యులుగా లింగారెడ్డి, సౌభాగ్య, రాజు, కొండల్ రెడ్డి, చైతన్య, రమేష్ తదితరులు ఎన్నికయ్యారు. నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపల్లి పద్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా తన్నీరు శ్రీనివాస్, బెలిదె అశోక్, యావపురం రవి ఎన్నికయ్యారు.

# ముస్తాబాద్‌లో అక్రమ మద్యంకు అడ్డుకట్ట

**- వరుస దాడులు, విస్తృత తనిఖీల్లో మద్యం పట్టివేత**

**- అక్రమంగా తరలిస్తున్న 30.6లీటర్ల మద్యం స్వాధీనం**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముస్తాబాద్ మండలంలో అక్రమ మద్యంకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. ఓ వైపు గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు కట్టడి చేస్తూనే, మరోవైపు అక్రమంగా తరలించే మద్యంపై నిఘా పెట్టారు. వరుస దాడులు, విస్తృత తనిఖీలతో అక్రమ మద్యం పట్టుకుంటున్నారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ఓటర్లు ప్రలోభాలకు లోనవ్వకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు, అదేవిధంగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ముస్తాబాద్ మండలం నుంచి మోహినికుంట గ్రామానికి అక్రమంగా తరలిస్తున్న మద్యంను ఎస్ఐ సిహెచ్.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాపై చేపడుతున్న తనిఖీల్లో భాగంగా పోలీసులు మద్దికుంట గ్రామం వద్ద వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యంను పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న 30.6లీటర్ల 167 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని, పల్లటి కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి నిఘా పెంచామని తెలిపారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, కానిస్టేబుల్ ఖాసీం,సాయికృష తదితరులు ఉన్నారు.

# ఉంగరం గుర్తు గెలుపు..

*** గ్రామాభివృద్ధికి మలుపు :**

*** కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఉంగరం గుర్తు గెలుపు.. గ్రామ అభివృద్ధికి మలుపు అని అల్లాపురం స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని అల్లాపురం గ్రామంలో మంగళవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించారు. ముఖ్యంగా మహిళలతో ఆప్యాయంగా మాట్లాడుతూ, వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రచారంలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపడంలో ముందుంటానన్నారు. తన భర్త శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ గా చేసిన అభివృద్ధిని సైతం ప్రజలు గుర్తుచేయడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు, వృద్ధులు, యువత నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ఉంగరం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.

## యాదగిరిగుట్ట మండలంలో

# ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రచారం

యాదాద్రి భువనగిరి ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట మండలంలోని బీర్ల అయిలయ్య సొంత గ్రామం సైదాపూర్,మాసాయిపేట గ్రామం, గౌరయిపల్లి, సాధువెల్లి, కాచారం, ధర్మారెడ్డి గూడెం, చిన్న కందుకూరు,పెద్దకందుకూరు, చోల్లేరు, వంగపల్లి, రామాజిపేట, గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి గ్రామాలను ఈ ప్రజా పాలనలో అభివృద్ధి చేసుకుందామన్నారు. ప్రజల మద్దతుతో నియోజకవర్గంలో 90 శాతానికి పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాంతాల లక్ష్యమని,గ్రామీణ అభివృద్ధి,ప్రజా సంక్షేమం,



సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రభావంతో ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులు అవుతున్నారని, ప్రతి ఒక్కరికీ పార్టీ ఎల్లపుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల్లోని నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## కక్షిదారుల కొరకు కోర్టులో త్రాగు నీరు ప్రారంభించిన జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి




ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: స్థానిక ఇల్లందు కోర్టు ఆవరణం నందు ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కక్షిదారుల కొరకు త్రాగు నీటిని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కటింగ్ చేసి కక్షిదారులకు త్రాగు నీటిని అందజేశారు. అనంతరం వారు కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కక్షదారుల కొరకు త్రాగునీటిని ఏర్పాటు చేయడం సంతోషకరమని సుదూర ప్రాంతాల నుంచి కోర్టు వచ్చే కక్షిదారులకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ముఖ్యంగా త్రాగునీరు లేక వయోవృద్ధులైన కక్షిదారులు, కక్షిదారుల వెంట వచ్చే పిల్లలకు దాహార్తి తీర్చడానికి ఎంతో ఉపయోగపడుతుందని మునుముందు ఇలాంటి మౌలిక సదుపాయాలు కక్షిదారుల కోసం ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపినారు. ఈ కార్యక్రమంలో జడ్జి తో పాటు ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు దంతాల ఆనంద్ ,ఎస్. వెంకటేశ్వర్లు, పి. బాలకృష్ణ, బి. ఊర్మిళ, జూనియర్ న్యాయవాదులు పి. ధనంజయరావ్, భరత్, పూజ, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో తొలి విడతలో జరగబోయే పంచాయితీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు. మొత్తం 320 పోలింగ్ స్థానాలలోని 1510 పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.సుమారుగా 1700 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.1510 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు 723, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 157,అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 24,క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 16,మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు 590 లను గుర్తించినట్లు తెలిపారు.ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలీస్ అధికారులు,సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా

## అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాను

**- గిర్కాటి నిరంజన్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: గ్రామ సర్పంచ్ గా అవకాశం ఇచ్చి గెలిపిస్తే.. గ్రామ ప్రజలు ఆశ్చర్యపోయేలా అభివృద్ధి చేసి చూపిస్తానని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, దండు మల్కాపురం టిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గిర్కాటి నిరంజన్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. సాయంత్రం అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో, తనకు వచ్చిన బ్యాట్ గుర్తు వచ్చినట్లు తెలిపారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ముందుకు సాగారు. మహిళలు, వృద్ధులు, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ తన బ్యాట్ గుర్తును చూపుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిర్కాటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి చేపట్టడంతోనే అంధాకారం అలుముకుందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారం చేపట్టిన గత దశాబ్ద కాలం పాటు గ్రామాలు అభివృద్ధిపథంలో నడిచాయన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. గ్రామాల్లో ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్ లు, వైకుంఠధామాలు ఏర్పాటు చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వం సొంతమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయని, తద్వారా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. గ్రామాల్లోని ప్రజలు ఆలోచించి తమ నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. దండు మల్కాపురం గ్రామ ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

# బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి తిరుపెళ్ళి బాపురెడ్డి జోరుగా ప్రచారం



*** సమన్వయంతో తొలి విడత పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయాలి**

*** కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న తొలి విడత ఎన్నికల కోసం కేటాయించిన సిబ్బంది తమ విధులకు సంబంధిత కేంద్రాల్లో రేపు ఉదయం తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి సమయానుసారంగా తరలించాలని అన్నారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి తగినన్ని ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు.పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్ జరగనుండటంతో, ప్రజల్లో అవగాహన కల్పించేలా పంచాయతీ వాహనాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తుతో పాటు వీడియో పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని, వీడియో కెమెరాలు బ్యాలెట్ బాక్సులను నిరంతరం పర్యవేక్షించేలా అమర్చాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహనతో పనిచేయాలని, వారు కలిగే సందేహాల నివృత్తికి తగిన శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు తరలించేందుకు అవసరమైన రవాణా వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుని, నిర్దేశించిన రూట్లలోనే తరలించాలన్నారు. పోలింగ్ రోజు నివేదికలు సమర్పించేందుకు ప్రత్యేక ఆపరేటర్‌ను నియమించి, వారికి తగిన శిక్షణ ఇచ్చి సమయానికి అన్ని నివేదికలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున పోలింగ్ అనంతరం ర్యాలీలు, సంబరాలు, విజయోత్సవాలు నిర్వహించేందుకు అనుమతి ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన భోజనం, రవాణా వంటి సదుపాయాలు ఖచ్చితంగా కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాం

## టు బిహెచ్ ఇండ్ల సమస్యలపై సీఎం రేవంత్‌కు లేఖ




మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి :రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ గృహాల్లో నెలలుగా కొనసాగుతున్న తీరని సమస్యలపై తెలంగాణ టు బిహెచ్కె ఉమ్మడి చైతన్య కమిటీ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరణాత్మక లేఖ అందజేసింది. మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్ టి పి) నిర్వహణ భారం ప్రభుత్వమే తీసుకోవాలని, లేదా ప్రత్యామ్నాయ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి - లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకూడదన్నారు. లిఫ్ట్‌ల వార్షిక నిర్వహణ ఒప్పందం (ఏఎంసి) మరో రెండేళ్లు ప్రభుత్వమే చూసుకోవాలి. అన్ని లిఫ్ట్‌లు సక్రమంగా పనిచేసే వరకు బాధ్యతను లబ్ధిదారులకు అప్పగించరాదు. రాష్ట్రంలోని అన్ని డబుల్ బెడ్‌రూమ్ కాంప్లెక్స్‌ల టెర్రస్‌లు తీవ్రంగా దెబ్బతిన్నాయి - వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం సమయంలో వాడే జనరేటర్లు (డీజీ సెట్లు) ఇంకా అమర్చలేదు, ఎక్కడ మొదలైతే అక్కడే పూర్తి కాలేదు - తక్షణం అమర్చాలన్నారు. మురహరిపల్లి టు బిహెచ్కె ప్రాజెక్టులో లబ్ధిదారులకు ఇంకా ఇండ్లు అందజెయ్యలేదు - పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి కీలు అందించాలన్నారు. ఈ లేఖను తీసుకెళ్లిన కమిటీ నాయకులతో ప్రజాదర్బార్ ఇన్‌చార్జి చిన్నారెడ్డి సుమీర్ఘంగా చర్చించారు. సమస్యల పట్ల అత్యంత సానుకూలంగా స్పందించిన ఆయన, లేఖను వెంటనే మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ , తెలంగాణ గృహ నిర్మాణ శాఖాధిపతి గౌతమ్‌కు అధికారికంగా పంపారు. “ఈ అంశాలపై త్వరలోనే సానుకూల చర్యలు ఉంటాయి” అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హైమద్‌గూడ నుండి సందీప్, జంగిలి శివకుమార్, అనురాధ. చర్లపల్లి నుండి సోయల్. నిజాంపేట్ నుండి జైపాల్, అపర్ణ, హరిత, శాంత. బహదూర్‌పుర నుండి శ్రీనివాస చారి, షేక్ హైమద్. మురారిపల్లి నుండి అనిల్ కుమార్, వెంకటేష్, సంతోష్, రాంబాబు. కైసర్ నగర్ నుండి గోపాల్, లక్ష్మి, వెంకట రమణయ్య. గాజులరామారం నుండి నీలిమ తదితర టు బిహెచ్కె లబ్ధిదారులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే జైలు పాలా..?

*** పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారా..?**

*** మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా రెడ్డి ఆరోపణలు**

యాదాద్రి భువనగిరి, ప్రజా స్ఫూర్తి: పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేస్తుందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం బాహుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ దౌర్జన్యాలు పెరిగిపోయాయని, అరాచకమే రాజ్యమేలుతోందని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నారని గ్రహించిన అధికార పార్టీ, బీఆర్ఎస్ అభ్యర్థులను భయపెట్టి జైలు పంపిస్తామని, కోర్టుల చుట్టూ తిప్పేస్తామని బెదిరిస్తోందని అన్నారు. బాహుపేట గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి కవిడే మహేందర్‌పై గత వారం రోజులుగా పార్టీ మారమని ఒత్తిడి తెస్తున్నారని, ఆయన వెనక ఇద్దరు పోలీసులను పెట్టి భయపెడుతున్నారని తెలిపారు. సర్చ్ వారెంట్ లేకుండా ఇంట్లోకి చొరబడి మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్న ఘటనలను కూడా ఆగ్రహంగా ప్రస్తావించారు.అధికార పార్టీ సూచనలు మేరకు పోలీసులు వ్యవహరించుతుంటే, ఎన్నికల సంఘం వద్ద అధికారికంగా ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు, పోలీసులు కలిసి అభ్యర్థులను వేధిస్తున్నారని, వారందరిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ అహంకారంతో పాలన సాగిస్తోందని, ఏ తప్పు జరిగినా కలెక్టర్‌తో పాటు కాంగ్రెస్‌దే బాధ్యత అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ బలం రెట్టింపు స్థాయిలో పెరిగిందని, ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు దిగుతుందని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఊరురా గులాబీ జెండా ఎగరేయాలని, ఓటుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని ఇద్దరు నాయకులు పిలుపునిచ్చారు.

## ఎల్లంబావి సర్పంచ్ ఏకగ్రీవం.. సర్పంచ్ గా గంజి వనజ కృష్ణ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు గంజి వనజ కృష్ణకు తమ మద్దతు తెలిపారు. దీంతో ఎల్లంబావి సర్పంచ్ గా గంజి వనజ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

***గ్రామాన్ని అన్ని రంగాల అభివృద్ధి చేస్తా***

**- *గంజి వనజ కృష్ణ***

ఎల్లం బావి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానని గంజి వనజ కృష్ణ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన తనను సర్పంచ్ ఏకగ్రీవం చేసిన గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భర్త గంజి కృష్ణ స్వల్ప మెజార్టీతో ఓటమిపాలైనప్పటికీ, ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మద్దతుగా నిలిచారని గుర్తు చేశారు. నీటి ఎద్దడి తీర్చడంలో, యువజన సంఘం నిర్మాణం యువకులకు చేయూతనివ్వడంలో ముందు వరుసలో నిలిచారని గుర్తు చేశారు. తన కష్టాన్ని గుర్తించిన ప్రజలు నేడు ఏకగ్రీవం సాధ్యం చేశారన్నారు. తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ పదవికి ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా జ్యోతి నగర్ నుంచి ఎల్లం బావి వరకు బిటి రోడ్డు నిర్మాణం, నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, త్రాగునీరు కోసం ప్రత్యేకంగా ఫిల్టర్ల ఏర్పాట్లు వీటితోపాటు పలు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు ఆశీర్వదించి ఏకగ్రీవం చేసిన సర్పంచ్ పదవికి తగిన న్యాయం చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## కొల్లూరు సర్పంచ్ అభ్యర్థి ని గెలిపించాలని ప్రచారం



ఆలేరు ప్రజాస్ఫూర్తి : మంగళవారం ఆలేరు మండలం, కొల్లూరు గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గంగరాజు మాధవి రామకృష్ణ తో పాటు వార్డు అభ్యర్థులను గెలిపించాలని కోరిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి,కొల్లూరు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొనారు..

## సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలి

*** సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భరోసా బృందం,సైబర్ సెక్యూరిటీ విభాగం అధికారులు సంయుక్తంగా సుజాతనగర్ లోని శ్రీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో లైంగిక వేధింపులు,సైబర్ భద్రతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ బి.అశోక్ కుమార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.సైబర్ క్రైమ్ సీఐ ఎస్. జితేందర్,భరోసా ఇన్‌స్పెక్టర్ బి.రాము,భరోసా ఎస్సై అరుణ,భరోసా కో ఆర్డినేటర్ రేణుక,భరోసా సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు,ఆన్‌లైన్ మోసాలు,నకిలీ ఖాతాలు,సైబర్ బుల్లీయింగ్,సైబర్ స్టాకింగ్, ఫోటోలు వీడియోల మార్పు చేయడం (మార్ఫింగ్),మహిళలు,చిన్నారులపై ఆన్‌లైన్ లైంగిక నేరాలు వంటి అంశాలపై వివరించారు.వ్యక్తిగత సమాచారాన్ని తెలియని వ్యక్తులతో లేదా అసురక్షిత సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో పంచుకోవద్దని సూచించారు.ఆన్‌లైన్ బెట్టింగ్,నకిలీ ప్రొఫైల్ మోసాలు మరియు డిజిటల్ వేదికల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.లైంగిక దాడులు మరియు వేధింపులకు గురైన బాధితులకు భరోసా కేంద్రం అందించే సేవలను గురించి వివరించారు.అలాగే మాదకద్రవ్యాల వలన కలిగే శారీరక,మానసిక,సామాజిక ఆర్థిక సమస్యలను వివిధ ఉదాహరణలతో వివరించారు.భరోసా కేంద్రం స్థాపన అవసరాన్ని,అందించే సేవలను మరియు పిల్లల రక్షణ కోసం అమలు చేసే పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. యువత,మహిళలు సైబర్ వాతావరణంలో సురక్షితంగా ఉండేందుకు,జరిగే ఏవైనా వేధింపులను నిర్భయంగా ఆవిష్కరించి సహాయం పొందేందుకు అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## జోగిపేటలో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

**- స్వీట్లు పంపిణీ చేసిన నాయకులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మంగళవారం జోగిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష అయినటువంటి ప్రత్యేక రాష్ట్రాన్ని సోనియా గధీ మనకు అందించారని, ఆమెను తెలంగాణ సమాజం మరువకూడదని ఆయన అన్నారు. అనంతరం పట్టణంలో వ్యాపార వాణిజ్య హోటల్స్ వద్ద ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసారు. . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శరత్ బాబు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు చిట్యాల మధు, యాదయ్య, ఖాలేద్, మార్కెట్ డైరెక్టర్ అలీ, కాంగ్రెస్ నాయకులు గుర్రం కష్ణ, గోహేర్ అలీ, అనిల్, భాస్కర్, అశోక్, అబ్బాస్ అలీ, అక్బర్ అలీ, నందు, వీరేష్, మురళి, సత్యం, చోటు ఖాన్, నజర్ ,తదితరులు పాల్గొన్నారు

# ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తెలంగాణ: భట్టి విక్రమార్క

హైదరాబాద్: దేశ ఎకానమీ చరిత్రలో లేని అత్యంత భారీ లక్ష్యాన్ని 2047 కోసం నిర్దేశించుకున్నామని, తెలంగాణను ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో భాగంగా రెండో రోజు 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం కోసం మూలధనం, ఉత్పాదకత పెంపు అంశంపై సెషన్ నిర్వహించారు. దీనిలో భట్టి విక్రమార్కతో పాటు విజన్ డాక్యుమెంట్‌లో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ ప్రసన్న తాంత్రి, ఐఎస్‌బీ ఫ్యాకల్టీ ఆదిత్య, పారిశ్రామికవేత్త పరశురాం పాక, ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 కేవలం డాక్యుమెంట్ కాదు, భవిష్యత్ కోసం తాము చేస్తున్న ప్రతిజ్ఞ అని ఉపముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఎకానమీ ప్రస్తుతం దాదాపు 185 బిలియన్ డాలర్ల వరకు ఉందని



చెప్పారు. త్రీ ట్రిలియన్ డాలర్లు చేరుకునేందుకు 22 ఏళ్లలో 16 రెట్లు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గుజరాత్, కర్ణాటక సహా దేశంలోని ఏ రాష్ట్రం కూడా అంత స్థాయిలో వృద్ధి చెందలేదని, దేశ ఎకానమీ చరిత్రలో లేని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. కేవలం కష్టపడితేనే, మరిన్ని రోడ్లు.. భవనాలు కడితే మాత్రమే లక్ష్యాన్ని చేరుకోలేమని.. ఎకానమీ ప్రాథమిక సూత్రాలను మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. క్యాపిటల్, ఇన్నోవేషన్ కలిపి ఉత్పాదకత పెంచడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమని పేర్కొన్నారు. డీప్ టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్‌లు ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో తెలంగాణను ఆసియాకు ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్‌తో ప్రాంతాల వారీ ప్రణాళికతో విజన్ డాక్యుమెంట్ వస్తోందని చెప్పారు.

## జీహెచ్‌ఎంసీలో వార్డుల సంఖ్య
# 150 నుంచి 300కి పెంపు




గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో వార్డుల సంఖ్యను రెట్టింపు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 150 వార్డులను 300కు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. నగర పాలన, పరిపాలన సౌలభ్యం కోసం ఈ మార్పు చేసినట్లు స్పష్టం చేసింది. ఇటీవల జీహెచ్‌ఎంసీ పరిధిని విస్తరిస్తూ సమీపంలోని 27 మున్సిపాలిటీలను విలీనం చేసిన విషయం తెలిసిందే. ఈ విలీన ప్రక్రియ నేపథ్యంలో పెరిగిన జనాభా, విస్తీర్ణానికి అనుగుణంగా వార్డుల పునర్విభజన అనివార్యమైంది. ఇందులో భాగంగానే వార్డుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో జీహెచ్‌ఎంసీ రాజకీయ స్వరూపం పూర్తిగా మారనుంది. వార్డుల పునర్విభజన ప్రక్రియను అధికారులు త్వరలోనే ప్రారంభించనున్నారు. కొత్తగా విలీనమైన ప్రాంతాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఈ పెంపు దోహదపడుతుందని భావిస్తున్నారు. భవిష్యత్తులో జరిగే కార్పొరేషన్ ఎన్నికలు 300 వార్డుల ప్రాతిపదికనే జరగనున్నాయి.

## ఫ్యూచర్ సిటీలో త్వరలోనే
# యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: భారీగా ఉద్యోగాలు వచ్చేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నెట్ జీరో కార్బన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు నాలుగో న్యూక్లియస్ (కేంద్రం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు.



"13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని మెట్రో రైలుతో అనుసంధానిస్తాం. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం. జోన్లవారీగా విభజించి ప్రతి జోన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దుతాం. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయి. ఫ్యూచర్ సిటీలో వర్సిటీల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. జూపార్క్ ఏర్పాటుకు వంతారాతో ఇప్పటికే ఒప్పందం జరిగింది. 400 ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుంది" అని శ్రీధర్‌బాబు వివరించారు.

# 3 ట్రిలియన్ ఎకానమీలో టూరిజం పాత్ర కీలకం: మంత్రి జూపల్లి

హైదరాబాద్: దేశంలోనే తెలంగాణకు మంచి చారిత్రక వారసత్వ సంపద ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన తెలంగాణ హెరిటేజ్, కల్చర్, ఫ్యూచర్ రెడీ టూరిజం సెషన్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి పాల్గొన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలంటే టూరిజం పాత్ర కీలకమన్న మంత్రి.. అందుకు ఇటీవల తీసుకువచ్చిన టూరిజం పాలసీ 202530 ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మన చారిత్రక వారసత్వం గురించి తెలంగాణ పౌరులంతా తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎకో టూరిజం నూతనాధ్యాయంగా నిలుస్తుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర విస్తీర్ణంలో 19 శాతం అడవులు



ఉండడం, స్వతఃసిద్ధంగా తెలంగాణ ప్రకృతిరమణీయంగా ఉండటం మంచి వరమని అభివర్ణించారు. ఇలాంటి నేలపై ఉన్న దేవాలయాలు కూడా మరింత అభివృద్ధికి నోచుకోవాలని తెలిపారు. అందుకోసం టూరిజం డిపార్ట్‌మెంట్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య 36కు పెరగడం హర్షించదగ్గ విషయమన్నారు. దేవాలయాలను పునరుద్ధరిస్తామన్న మంత్రి... వాటి పరిరక్షణ కేవలం పరిపాలన అంశం మాత్రమే కాదని, జీవ వైవిధ్య, ప్రజల సంస్కృతిని పరిరక్షించడమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామోజీ ఫిల్మ్‌సిటీ వైస్ ప్రెసిడెంట్ ఏవీ రావు పాల్గొని మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీ కోర్ సినిమా అని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి.. టూరిజాన్ని మరింత పెంచుతుందన్నారు. 'తెలంగాణ జరూర్ ఆనా' మంచి క్యాచీ నినాదంగా మారిందన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో వాటర్ పార్క్ లాంటివి త్వరలో తీసుకురానున్నట్లు తెలిపారు. ఎకో టూరిజం, మెడికల్ టూరిజం, వెల్‌నెస్ టూరిజంపై ప్రత్యేక దృష్టిసారించనున్నట్లు పేర్కొన్నారు.

## డిసెంబరు 9.. రాష్ట్ర ఏర్పాటుకు
# తొలి అడుగుపడిన రోజు: కేటీఆర్

హైదరాబాద్: తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. విజయ్ దివస్ సందర్భంగా ఆయన ఎక్స్‌లో.. కేసీఆర్ దీక్ష విరమించిన



ఫోటోలు పంచుకున్నారు. సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కేసీఆర్ నిరవధిక నిరాహార దీక్షతో దిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏళ్లు అని తెలిపారు. నవంబర్ 29న దీక్షా దివస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివస్ లేదన్న ఆయన.. డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని అన్నారు.

# తెలంగాణలో అద్భుతమైన క్రీడాపాలసీ తీసుకొచ్చాం

**: మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్: "క్రీడాకారులూ.. మేమంతా మీపైనే ఆశలు పెట్టుకున్నాం. ఆటనే దైవంగా భావించి ఆడండి. ప్రపంచం మీ వైపు చూస్తోంది" అని తెలంగాణ క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అద్భుతమైన క్రీడా పాలసీ తీసుకువచ్చిందన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047లో ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ ప్యానెల్ డిస్కషన్‌లో వాకిటి శ్రీహరి, మంత్రి అజారుద్దీన్‌లతో పాటు, క్రీడాకారులు పీవీ సింధు, గుత్తా జ్వాల, గోపీచంద్, అంబటి రాయుడు, అనిల్ కుంబ్లే పాల్గొన్నారు. క్రీడాకారుల విజయానికి అనేక అంశాలు దోహదం చేస్తాయని పీవీ సింధు అన్నారు. మౌలిక వసతులు, కోచ్‌లు చాలా కీలకమని చెప్పారు. ప్రతి దశలోనూ క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమన్నారు. మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. "తెలంగాణ నుంచి సైనా నెహ్వాల్, నిఖత్ జరీన్ వంటి అనేకమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి వెళ్లారు. గోపీచంద్ అకాడమీ నుంచి అనేకమంది



వచ్చారు. క్రీడాభివృద్ధిలో మైదానాల పాత్ర చాలా కీలకం. ఫుట్‌బాల్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పీవీ సింధు, సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల మంచి పేరు తెచ్చుకున్నారు. క్రీడాకారులకు ఆర్థిక సమస్యలు లేకుండా చూడాలి. గతంలో కోచ్‌ల కొరత ఎక్కువగా ఉండేది.. ఇప్పుడు దాన్ని అధిగమించాం" అని పేర్కొన్నారు.



# పృధ్వీరాజ్ నగర్ పాఠశాలను సందర్శించిన స్టేట్ టీం ఓఎస్డీ సుధాకర్ రెడ్డి

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి మండలం గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆఫీస్‌కు చెందిన స్టేట్ టీం ఓఎస్డీ సుధాకర్ రెడ్డి మంగళవారం ఏహెచ్ఎస్ సర్వారం పే సెంటర్ పరిధిలోని టిడబ్ల్యూ యూపీఎస్ పృధ్వీరాజ్ నగర్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల కార్యకలాపాలు, విద్యార్థుల స్థాయినీ స్వయంగా పరిశీలించిన ఆయన పాఠశాల మౌలిక వసతులను సమగ్రంగా పరిశీలించారు.తరగతి వారీగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అంచనా వేశారు. ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవేశపెట్టిన 'ఉద్దీపకం 2' వల్ల విద్యార్థుల నేర్పు, ఫలితాలు గణనీయంగా మెరుగయ్యాయని ప్రశంసించారు.విద్యార్థుల్లో కనిపించిన క్రమశిక్షణ, ప్రదర్శన, నేర్చుకునే ఆసక్తి పట్ల సంతోషం వ్యక్తం చేసిన సుధాకర్ రెడ్డి,ఉపాధ్యాయుల బోధన విధానం, కృషిని మెచ్చుకున్నారు. పాఠశాల అభివృద్ధికి అందరూ కలసి మరింత అంకితభావంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ఎస్సీ ఆర్ పి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ఉపాధ్యాయులు రమేష్, కౌసల్య, జయదేవ్, సురేష్, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో ఒప్పందాలు..
# ముగిసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్

**హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో రికార్డు స్థాయిలో ఒప్పందాలు కుదిరాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పలు సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. రెండు రోజుల్లో కలిపి వివిధ కంపెనీలు, పరిశ్రమలు రూ.5.75 లక్షల కోట్ల మేర పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సమిట్ మంగళవారం ముగిసింది.**
















# రైలు ఫుట్‌బోర్డ్ ప్రయాణం..ఆ కేసులో 'నిర్లక్ష్యం'గా చూడలేం - బాంబే హైకోర్టు

ముంబయిలో సబర్బన్ రైల్లో ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి కుటుంబానికి పరిహారం అందించే విషయంలో బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రద్దీ సమయంలో మరో మార్గం లేకనే ప్రాణాలు పణంగా పెట్టి డోర్ దగ్గర బాధితుడు అలా నిలబడాల్సి వచ్చిందని, దీన్ని నిర్లక్ష్యంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలన్న కింది కోర్టు తీర్పును సమర్థించింది. ముంబయిలోని భాయందర్ నుంచి మెరైన్ లైన్స్‌కు సబర్బన్ రైల్లో వెళ్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ కొన్ని రోజుల తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. 2005 అక్టోబర్ 28న ఈ ఘటన చోటుచేసుకోగా... బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని స్థానిక ట్రైబ్యునల్ 2009 డిసెంబర్‌లో తీర్పు చెప్పింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు చేసింది. ఇటీవల దీనిపై విచారణ జరిగింది. బాధితుడు టికెట్ లేని ప్రయాణం చేస్తున్నట్లు తెలిసిందని, ఘటన సమయంలో అతడి వద్ద టికెట్ లేదా పాస్ కనిపించలేదని రైల్వేశాఖ వాదించింది. అంతేకాదు.. ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించి



ప్రమాదానికి గురయ్యాడని పేర్కొంది. వీటిని బాధిత కుటుంబం న్యాయవాది తోసిపుచ్చారు. అతడికి సంబంధించిన రైల్వే పాస్, ఐడీ కార్డును అందించడంతో న్యాయస్థానం వాటిని పరిగణనలోకి తీసుకుంది. డోర్ దగ్గర నిర్లక్ష్యంగా ఉన్నాడని చెప్పడం సరికాదని ఈ సందర్భంగా న్యాయస్థానం అభిప్రాయపడింది. సబర్బన్ రైళ్లలో నేటికీ రద్దీ కొనసాగుతోందని, ఉద్యోగానికి వెళ్లే క్రమంలో మరో మార్గం లేకనే అలా నిలబడాల్సి వచ్చిందన్న వాస్తవాన్ని విస్మరించకూడదని పేర్కొంటూ బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని ఆదేశించింది.

## విమానం రద్దు.. కుమారుడి 'పరీక్ష' కోసం 800కి.మీ కారు నడిపి!

రోహతక్: ఇండిగో విమాన సర్వీసుల్లో నెలకొన్న తీవ్ర అంతరాయంతో అనేకమంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో హరియాణాలోని రోహతక్‌లోని మైనా గ్రామానికి చెందిన పంగల్ కుటుంబానికి సవాల్ ఎదురైంది. తాము బుక్ చేసుకున్న ఇండిగో విమానం రద్దు కావడంతో ఆందోళనకు గురైన తండ్రి.. కుమారుడిని ఎలాగైనా పరీక్ష రాయించాలని నిశ్చయించుకున్నాడు. దాదాపు 800కి.మీ మేర కారులో ప్రయాణించి పరీక్ష సమయానికి చేరుకునేలా చేశాడు. మైనాకు చెందిన రాజ్ నారాయణ్ పంగల్ చిన్న కుమారుడు అశీష్ చౌధరీ పంగల్.. ఇందౌర్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో 12వ తరగతి చదువుతున్నాడు.



సెలవుల్లో భాగంగా ఇటీవల స్వస్థలానికి వచ్చాడు. డిసెంబర్ 8 నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో 6న ఓ అవార్డు కార్యక్రమంలో పాల్గొనేందుకు విమాన టికెట్ బుక్ చేసుకున్నారు. తీరా ఎయిర్‌పోర్టుకు వెళ్లేసరికి ఇండిగో విమానం రద్దైనట్లు తెలిసింది. రైళ్లలోనూ టికెట్ అందుబాటులో లేవు. ఎలాగైనా పరీక్ష రాయించేందుకు కారులో తీసుకెళ్లాలని తన తండ్రి నిశ్చయించుకున్నాడు. దీంతో దిల్లీ నుంచి ఇందౌర్‌కు రాత్రి మొత్తం కారులో ప్రయాణించి.. మరుసటి రోజు ఇందౌర్ చేరుకొని పరీక్షకు హాజరయ్యాడు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎన్ని ఇబ్బందులైనా తట్టుకొనేందుకు సిద్ధంగా ఉంటారని తాజా పరిణామం మరోసారి రుజువుచేసింది.

## ఎన్నికల సంస్కరణలపై మూడు ప్రశ్నలు సంధించిన రాహుల్‌గాంధీ

ఎన్నికల సంస్కరణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందన్నారు. సీఈసీని కాపాడేందుకు ఏకంగా చట్టాలనే మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారమే తప్పు చేసినా శిక్ష అనుభవించకుండా తప్పించుకునే అవకాశాన్ని ఈసీకి కల్పించారన్నారు. ఓట్ల చోరీకి సంబంధించి తమ వద్ద అనేక ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు.



* ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా?
* సర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో.. ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
* ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా?

భాజపాకు అనుకూలంగా ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సీసీ ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలన్నీ ప్రజల ముందుకు తీసుకువచ్చినప్పటికీ ఇప్పటి వరకు వాటిపై ఈసీ తమకు సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 23 ఓట్లు ఉన్న అంశాన్ని ఆయన మళ్లీ గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్‌పైనా రాహుల్ గాంధీ లోక్‌సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ ఒక్కొక్కటిగా అన్ని వ్యవస్థలను కబ్జా చేస్తోందన్నారు. దేశంలోని వ్యవస్థలన్నిటిపైనా ఆధిపత్యం చూపిస్తోందని విమర్శించారు.

## ఎస్ఐఆర్ కొనసాగాల్సిందే రాష్ట్రాలకు స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ సవరణను సవాల్ చేస్తూ, దాని నిర్వహణలో ఎదురవుతోన్న పరిస్థితులపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బెంగాల్‌లో ఎస్ఐఆర్ జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగమైన బీఎల్ఓలు (బూత్ లెవెల్ అధికారులు), ఇతర అధికారులకు బెదిరింపులు రావడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలను తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థితులు ఎదురుకావొచ్చని హెచ్చరించింది. బీఎల్ఓలకు బెదిరింపులు, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాల గురించి తమ దృష్టికి తీసుకువస్తే.. వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించింది. బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గాలను అనుసరిస్తూ.. ఎస్ఐఆర్ జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే.. అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు వెల్లడించింది. ఇదిలా ఉంటే.. ఎస్ఐఆర్‌లో భాగమైన పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తోన్న సంగతి తెలిసిందే. ''బీఎల్‌వోలు పనిభారం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే.. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకోవచ్చు. వారి పని గంటలు తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవడాన్ని పరిగణనలోకి



తీసుకోవచ్చు. ఎస్ఐఆర్ విధుల నుంచి తమను మినహాయించాలని ఎవరైనా కోరితే.. అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది'' అని న్యాయస్థానం గతంలో పేర్కొంది. ప్రస్తుతం తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండోదశ ఎస్ఐఆర్ కొనసాగుతోంది.

## చిరుత దాడులను అడ్డుకోవాలంటే.. అడవుల్లోకి మేకలను వదలండి మహా మంత్రి

చిరుతలు జనావాసాల్లోకి ప్రవేశించకుండా అడ్డుకునేందుకు భారీ సంఖ్యలో మేకలను అడవుల్లోకి వదిలిపెట్టాలని మహారాష్ట్ర మంత్రి గణేశ్ నాయక్ సూచించారు. చనిపోయిన తర్వాత బాధితులకు పరిహారం అందించే బదులు.. అదే డబ్బుతో వచ్చే మేకలను అడవిలోకి వదిలివేయాలన్నారు. ఈ మేరకు అధికారులకు సూచించినట్లు తెలిపారు. మహారాష్ట్రలో చిరుత దాడులు గణనీయంగా పెరుగుతుండటం ఆందోళనకర విషయం అని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే జితేంద్ర అహ్వాద్ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా



ఈ విషయాన్ని సభలో ప్రత్యేకంగా ప్రస్తావించిన ఆయన.. ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటోందని ప్రశ్నించారు. దీనికి మంత్రి గణేశ్ నాయక్ బదులిచ్చారు. ''చిరుత దాడుల్లో ఒకవేళ నలుగురు మరణిస్తే.. పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి చెల్లించాలి. అందుకే మరణాల తర్వాత పరిహారం అందించే బదులు.. ఆ రూ.కోటి విలువైన మేకలను అడవుల్లోకి వదిలితే చిరుతలు జనావాసాల్లోకి రాకుండా ఉంటాయి'' అని వ్యాఖ్యానించారు. చిరుతల ప్రవర్తన, వాటి జీవన విధానాలు మారిపోయాయన్నారు. ఒకప్పుడు అడవి జంతువులుగా పేర్కొన్నప్పటికీ.. ఇప్పుడు వాటి ఆవాసం చెరకు తోటలకు మారిపోయిందన్నారు. అహల్యానగర్, పుణె, నాసిక్ జిల్లాల్లో చిరుత దాడులు ఇటీవల భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు.

## 'వందేమాతరం' ప్రజల్లో స్ఫూర్తి నింపుతూనే ఉంటుంది: అమిత్ షా

దిల్లీ: 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై పార్లమెంటులో ప్రత్యేక చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. లోక్‌సభలో సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించగా.. మంగళవారం రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలంతో సంబంధం లేకుండా 'వందేమాతరం' దేశ ప్రజల్లో ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉంటుందన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔచిత్యం ఉందని.. భవిష్యత్తులోనూ ఉంటుందన్నారు. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్



అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని.. ప్రజా సమస్యల నుంచి దేశాన్ని పక్కదారి పట్టించేందుకు వందేమాతరంపై చర్చకు తెర తీశారని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను అమిత్ షా ఖండించారు. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ బెంగాల్‌కు చెందిన వ్యక్తి అయినప్పటికీ.. ఈ గేయం కేవలం బెంగాల్‌కే పరిమితమైనది కాదన్నారు. వందేమాతరంపై ప్రజల్లో అభిమానం గతంలోనూ ఉందని.. భవిష్యత్తులోనూ కొనసాగుతుందన్నారు. బ్రిటిష్ వారు కూడా మన జాతీయగేయాన్ని ఆపలేకపోయారని పేర్కొన్నారు. బ్రిటిష్ సంస్కృతిని అనుసరించేవారు కూడా ఎప్పటికీ దానిని ఆపలేరన్నారు. పార్లమెంటు ఉభయసభల్లో ఈ చర్చ ద్వారా భవిష్యత్ తరాలు వందేమాతర గేయానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటాయని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని ఆ గేయంపై ప్రత్యేక చర్చను సోమవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. మొత్తంగా ఈ చర్చ కోసం దిగువ సభలో 10 గంటల సమయాన్ని కేటాయించారు. విపక్ష కాంగ్రెస్ తరఫున 'వందేమాతరం'పై లోక్‌సభలో పార్టీ ఉప నేత గౌరవ్ గొగొయ్, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా తదితరులు మాట్లాడుతూ.. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిపెట్టుకొని ఈ చర్చకు తెరతీశారని విమర్శించారు.

## సోనియా గాంధీకి కోర్టు నోటీసులు..!



కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కోర్టు నోటీసులు జారీ అయ్యాయి. భారత పౌరసత్వం రాక ముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారన్న ఆరోపణల నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై రౌజ్ అవెన్యూలోని సెషన్స్ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. అనంతరం సెషన్స్ కోర్టు సోనియాకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పవన్ నారంగ్ దీనిపై వాదిస్తూ.. సోనియాగాంధీకి పౌరసత్వం రాకముందే ఆమె పేరును ఓటరు జాబితాలో చేర్చారని, అందుకోసం అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై పునఃపరిశీలన అవసరమన్నారు. 1980లో ఓటర్ల జాబితాలో పేరు కోసం కొన్ని నకిలీ పత్రాలను సృష్టించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఆమె పేరును తొలగించి.. మళ్లీ 1983లో తిరిగి చేర్చారన్నారు. ఈ రెండు కూడా సోనియాకు పౌరసత్వం రాకముందే జరిగాయన్నారు. దీనికి సంబంధించిన కొన్ని ఆధారాలను సమర్పించారు. వీటన్నింటినీ పరిశీలించిన కోర్టు.. వివరణ ఇవ్వాలని సోనియాతో పాటు దిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి 6న జరగనుంది. ఇక, గతంలో ఇదే విషయంలో మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీనిని పిటిషనర్ సెషన్స్ కోర్టులో సవాల్ చేయగా.. ఈ నోటీసులు జారీ అయ్యాయి.

## ఇండోనేషియాలో అగ్నిప్రమాదం.. పలువురు మృతి

ఇండోనేషియా రాజధాని జకార్తాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది ఏరియల్ సర్వే కోసం ఉపయోగించే డ్రోన్లు తయారు చేసే ఏడంతస్తుల కార్యాలయంలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేకమంది అందులో చిక్కుకున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ ఘటనలో 20మంది ప్రాణాలు కోల్పోగా అనేకమంది మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అగ్నికీలలు సమీపంలోని భవనాలకు వ్యాపించడంతో అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యాలయ భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న గోదాంలోని బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మంటలు పైఅంతస్తులకు వ్యాపించడంతో భవనంలో అనేకమంది చిక్కుకున్నారని.. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలు



ఆర్పడానికి శ్రమిస్తున్నాయన్నారు.

## ఆపిల్ యాప్ స్టోర్‌లో వివాదాల 'సంచార్ సాథీ' హవా..

### డౌన్‌లోడ్స్ లిస్ట్‌లో నంబర్ వన్ ప్లేస్..!




**న్యూఢిల్లీ:** కొత్తగా మార్కెట్‌లోకి తీసుకురానున్న మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను డిఫాల్ట్‌గా ఉండాలని కేంద్రం ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేంద్రం తీసుకువచ్చిన సైబర్ సెక్యూరిటీ యాప్ ప్రతిపక్షాలతో పాటు కంపెనీల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో ఉత్తర్వులను టెలికమ్యూనికేషన్స్ విభాగం ఉపసంహరించుకున్నది. యాప్ తప్పనిసరి ఏం కాదని స్పష్టం చేసింది. తాజాగా యాప్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. సెన్సార్ టవర్ ఇటీవల డేటా ప్రకారం.. సంచార్ సాథీ యాప్‌కు యూజర్ల నుంచి స్పందన లభించింది.

నవంబర్ 29 వరకు భారత్‌లో అత్యధికంగా డౌన్‌లోడ్ చేసిన యాప్స్‌ల జాబితాలో 127వ స్థానంలో నిలిచింది. అయితే, డిసెంబర్ 2న కేవలం మూడురోజుల్లోనే గూగుల్, జెమిని, చాట్ ప్రధాన ప్లాట్‌ఫామ్‌లను అధిగమించి ఆపిల్ స్టోర్‌లో నెంబర్ వన్ ప్లేస్‌కు చేరుకుంది. అయితే, డిసెంబర్ 3న ప్రభుత్వం ప్రీ ఇన్‌స్టాలేషన్ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవడం విశేషం. అయినప్పటికీ యాప్ ఇంకా అగ్రస్థానంలోనే ఉన్నది. సంచార్ సాథీ యాప్‌పై ఒక్కసారిగా ఆసక్తిగా పెరగడానికి ప్రైవసీయే కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

గోప్యతా సమస్యలు తలెత్తిన నేపథ్యంలో యాప్స్‌పై యూజర్లలో ఆసక్తిని రేకెత్తించిందని.. దాంతో డౌన్‌లోడ్స్ సంఖ్యను నేరుగా ప్రభావితం చేసింది. అయితే, కేంద్రానికి అనుకూలంగా కొందరు బీజేపీ మద్దతుదారులే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లుగా ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. డౌన్‌లోడ్స్ పెరిగేందుకు ఇదే కారణమని పేర్కొంటున్నారు. అయితే, ఇది కేవలం తాత్కాలికమేనని చెబుతున్నారు. అదే సమయంలో గూగుల్ ప్లే స్టోర్‌లోనూ సంచార్ సాథీ యాప్ డౌన్‌లోడ్స్ గణనీయంగా పెరిగాయి. డిసెంబర్ 1న 15వ స్థానంలో నిలువగా.. 3వ తేదీన రెండో స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్నది.

## అనిల్ అంబానీ కుమారుడిపై సీబీఐ కేసు

### అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్‌పై సీబీఐ కేసు

### రూ.228 కోట్ల బ్యాంకింగ్ మోసానికి సంబంధించిన వ్యవహారం

### యూనియన్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో జై అన్మోల్ అంబానీ



**ముంబై:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ కు సంబంధించిన బ్యాంకింగ్ మోసం కేసులో ఆయనపై ఈ చర్యలు తీసుకున్నారు. అనిల్ అంబానీ కుమారుడిపై క్రిమినల్ కేసు నమోదు కావడం ఇదే మొదటిసారి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ రంగంలోకి దిగింది. ఈ కేసులో జై అన్మోల్‌తో పాటు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, కంపెనీ మాజీ సీఈఓ రవీంద్ర సుధాల్కర్‌లను కూడా నిందితులుగా చేర్చారు. చీటింగ్, నేరపూరిత కుట్ర, నిధుల దుర్వినియోగం ద్వారా బ్యాంకుకు రూ.228.06 కోట్ల నష్టం కలిగించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

సీబీఐకి అందిన ఫిర్యాదు ప్రకారం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ వ్యాపార అవసరాల కోసం బ్యాంకు నుంచి రూ.450 కోట్ల వరకు రుణ సదుపాయం పొందింది. అయితే, కంపెనీ సకాలంలో వాయిదాలు చెల్లించడంలో విఫలమవడంతో 2019 సెప్టెంబర్ 30న ఈ ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు.

అనంతరం గ్రాంట్ థార్న్‌టన్ సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో కంపెనీ రుణాలుగా పొందిన నిధులను ఇతర అవసరాలకు దారి మళ్లించినట్లు తేలింది. ప్రమోటర్లు, డైరెక్టర్ల హోదాలో ఉన్న నిందితులు ఖాతాలను తారుమారు చేసి, నిధులను పక్కదారి పట్టించి బ్యాంకును మోసం చేశారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఫిర్యాదులో ఆరోపించింది. ఈ కేసులో భాగంగా సీబీఐ అధికారులు కంపెనీకి సంబంధించిన పత్రాలు, లోన్ అకౌంట్లను పరిశీలించనున్నారు.

## భారత బియ్యంపై ట్రంప్ టారిఫ్...

### పతనమైన సెన్సెక్స్, నిఫ్టీ

### లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### 436 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్, 120 పాయింట్లు పడిపోయిన నిఫ్టీ

### భారత బియ్యంపై అమెరికా కొత్త టారిఫ్‌లు విధించవచ్చన్న ఆందోళన

### ఐటీ, ఆటో, ఫార్మా షేర్లలో అమ్మకాల ఒత్తిడి

### లాభాల్లో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో సూచీలు పతనమయ్యాయి. దీనికితోడు, భారత బియ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త సుంకాలు విధించవచ్చనే వార్తలు సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 436.41 పాయింట్లు నష్టపోయి 84,666.28 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 120.90 పాయింట్లు క్షీణించి 25,839.65 వద్ద ముగిసింది. ఏషియన్ పెయింట్స్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి హెవీవెయిట్ షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. అయితే, ఎటర్నల్, టైటాన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎస్బీఐ వంటి షేర్లు లాభాల్లో ముగిసి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి.

ప్రధాన సూచీలు నష్టపోయినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 0.32 శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.14 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ, ఆటో, ఫార్మా సహా చాలా రంగాల సూచీలు దాదాపు 1 శాతం మేర నష్టపోయాయి.

అంతర్జాతీయ వాణిజ్య ఆందోళనలు, లాభాల స్వీకరణ మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సమీప భవిష్యత్తులో సెంట్రల్ బ్యాంకుల నిర్ణయాలు, కరెన్సీ కదలికలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి 23 పైసలు బలపడి 89.82 వద్ద ముగిసింది.

# హార్దిక్ ఆల్‌రౌండ్ షో..

### బోణీ ఘనంగా..

### తొలి టీ20లో భారత్ రికార్డు విజయం

### బౌలర్ల సమష్టి ప్రదర్శనతో సఫారీలు కుదేలు




**కటక్:** సొంతగడ్డపై వచ్చే ఏడాది జరుగబోయే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టు.. మెగా టోర్నీ ప్రయాణాన్ని ఘనవిజయంతో ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్ఇండియా.. 101 పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. బ్యాట్‌తో టాపార్డర్ నిరాశపరిచినా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 59 నాటౌట్, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. అతడి మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 175/6 స్కోరు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా.. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో 12.3 ఓవర్లలో 74 రన్స్‌కే తోకముడిచింది. అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్, అక్షర్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 ఈనెల 11న ముల్లాన్‌పూర్‌లో జరుగుతుంది. 48/3. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ పవర్ ప్లేలో చేసిన స్కోరిది. టెస్టు, వన్డే సారథి శుభ్‌మన్ గిల్ (4), టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12)తో పాటు స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ (17) తీవ్రంగా నిరాశపరిచారు. ఎంగిడి వరుస ఓవర్లలో షాకులివ్వడంతో టీమ్ఇండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఈ దశలో హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (26), అక్షర్ (23) కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 30 రన్స్ జోడించినా వేగంగా ఆడలేకపోయారు. అయితే 12వ ఓవర్లో తిలక్ ఔట్ అవడంతో క్రీజులోకి వచ్చిన హార్దిక్.. ఆరంభం నుంచే సఫారీ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మహారాజ్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లు బాదిన అతడు.. నోకియా బౌలింగ్‌లో రెండు బౌండరీలు కొట్టాడు. అక్షర్ నిష్క్రమించినా ఆఖర్లో దూబె (11), జితేశ్ శర్మ (10బి)తో కలిసి భారత్‌కు భారీ స్కోరునందించాడు. సిపమ్లు ఓవర్లో అతడు 18 పరుగులు రాబట్టగా నోకియా ఆఖరి ఓవర్లోనూ 12 రన్స్ వచ్చాయి. ఛేదనలో తొలి ఓవర్లోనే డికాక్ వికెట్ కోల్పోయిన సఫారీలు.. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. అర్ష్‌దీప్ వరుస ఓవర్లలో డికాక్, స్టబ్స్‌ను ఔట్ చేసి సౌతాఫ్రికా వికెట్ల పతనాన్ని మొదలెట్టగా స్పిన్నర్లు అక్షర్ (2/7), వరుణ్ (2/19) రాకతో సఫారీ బ్యాటర్ల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆరో ఓవర్లో బంతినందుకున్న అక్షర్.. తొలి బంతికే సఫారీ సారథి మార్క్రమ్ (14)ను బౌల్డ్ చేశాడు. మరుసటి ఓవర్లో మిల్లర్ (1)ను హార్దిక్ బోల్తా కొట్టించగా వరుణ్.. ఫెరీరా (5)ను పెవిలియన్‌కు పంపాడు. యాన్సెన్ (12)ను వరుణ్ పదో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేయగా బుమ్రా ఒకే ఓవర్లో బ్రెవిస్ (22), మహారాజ్‌ను ఔట్ చేసి సఫారీల ఓటమిని ఖరారుచేశాడు. దూబే 13వ ఓవర్లో సిపమ్లు (2)ను ఔట్ చేసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

## పూరీ జగన్నాథ్‌ను దర్శించుకున్న టీమిండియా క్రికెటర్లు..!



**కటక్:** కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో టీమిండియా తొలి టీ20 మ్యాచ్ ఆడనున్నది. ఈ మ్యాచ్‌కు ముందు ఒడిశాలోని ప్రముఖ జగన్నాథ్ ఆలయానికి భారత జట్టు సందర్శించింది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం జగన్నాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసింది. ఆటగాళ్లతో పాటు టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, భార్య దేవిషా శెట్టితో కలిసి ఆలయానికి చేరుకున్నాడు. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మాన్ గిల్ సహా పలువురు ప్లేయర్స్ ఉన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్లేయర్లు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సేవాయత్‌ల సింహద్వారల వద్ద దీపాలువ వెలిగించి.. దక్షిణాఫ్రికాపై టీ20 సిరీస్‌లో భారత జట్టు విజయం సాధించాలని పూజలు చేశారు. ఈ చాలా రోజుల తర్వాత ఒడిశాలో అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతుండడం ఉత్సాహంగా ఉందని.. భారత ప్లేయర్లు అత్యుత్తమంగా రాణించి భారత్‌కు విజయం సాధించి పెట్టాలని ప్రార్థిస్తున్నట్లు ఓ పూజారి తెలిపారు. టెస్ట్, వన్డే సిరీస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా ప్రస్తుతం టీ20ల్లో తలపడనున్నాయి. దక్షిణాఫ్రికా టెస్టుల్లో 2-0 తేడాతో భారత్‌ను ఓడించింది. అయితే, వన్డేల్లో 2-1 తేడాతో భారత్ సిరీస్‌ను నెగ్గింది. వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌కు ముందు ఈ సిరీస్‌ను సన్నాహకంగా రెండు జట్లకు ఉపయోగపడనున్నది.

## ఒకే ఓవర్లో 4, 4, 6, 6, 4..





### టీ20ల్లో భారత కుర్రాడి విధ్వంసం..!

**న్యూఢిల్లీ:** టీ20 ఫార్మాట్ అంటే చాలు కుర్రాళ్లు రెచ్చిపోతున్నారు. నువ్వానేనా అంటూ పోటీపడి మరీ బౌలర్లను ఊచకోత కోస్తున్నారు. దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అమిత్ పస్సీ రికార్డు సెంచరీని మరువక ముందే.. తమిళనాడు బ్యాటర్ సన్నీ సంధు బౌండరీల మోతతో చెలరేగాడు. ఛేదనలో ప్రత్యర్థి బౌలర్‌కు చుక్కలు చూపిస్తూ ఒకే ఓవర్లో 26 పరుగులు పిండుకొని జట్టును ఒంటిచేత్తో గెలిపించాడు. సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసక ఆటతో చెలరేగిన సన్నీ వరుసగా.. 4, 4, 6, 6, 4 తో తమిళనాడుకు విజయాన్ని కట్టబెట్టాడు. కుర్రాళ్ల విధ్వసంక ఆటతో రంజుగా సాగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మరో క్రికెటర్ దంచేశాడు. తమిళనాడు బ్యాటర్ సన్నీ సంధు ఆకాశమే హద్దుగా విరుచుకుపడి సౌరాష్ట్ర నుంచి విజయాన్ని లాగేసుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి183 పరుగులు చేసింది. ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(101 నాటౌట్) అజేయ శతకంతో తమిళనాడును గెలుపు దిశగా నడిపాడు.

అయితే.. మిడిలార్డర్ తడబాటుతో సౌరాష్ట్ర పైచేయి సాధించింది. 139కే ఆరు వికెట్లు పడిన వేళ.. క్రీజులోకి వచ్చిన సన్నీ సంధు (30 : 9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధనాధన్ ఆటతో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించాడు. చేతన్ సకారియా వేసిన 17వ ఓవర్లో వరుసగా.. 4, 4, 6, 6, 4 బాది 26 పరుగులు రాబట్టాడీ చిచ్చరపిడుగు. సన్నీ మెరుపులతో 18.4 ఓవర్లలోనే తమిళనాడు లక్ష్యాన్ని అందుకుంది.

# 2026 ఐపీఎల్ కోసం ఆటగాళ్ల వేలం..

### తుది జాబితాలో 350 మంది క్రికెటర్లు



**అబుదాబి:** 2026 ఐపీఎల్ సీజన్‌కు డిసెంబర్ 16వ తేదీన ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఆ వేలంలో సుమారు 350 క్రికెటర్లు పాల్గొననున్నారు. దాంట్లో 240 మంది భారతీయ క్రికెటర్లు ఉన్నారు. టీ20 క్రికెట్ లీగ్ కోసం అబుదాబిలో వేలం జరగనున్నది. సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డీకాక్.. వేలం తుది లిస్టులో చేరాడు. వన్డే రిటైర్మెంట్ నుంచి వెనక్కి వచ్చిన అతను.. తాజా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. కోటి బేస్‌ప్రైజ్‌పై అతను అందుబాటులో ఉన్నాడు. ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ కూడా 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై వేలానికి రెడీ అయ్యాడు. 2021లో చివరిసారి స్టీవ్ స్మిత్ ఐపీఎల్ ఆడాడు.

వాస్తవానికి ఐపీఎల్ ప్లేయర్ ఆక్షన్ కోసం 1390 మంది రిజిస్టర్ చేసుకున్నారు. దాంట్లో నుంచి 350 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. తొలి సెట్‌లో భారత బ్యాటర్లు పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్.. 75 లక్షల బేస్‌ప్రైజ్‌పై వేలంలో నిలిచారు. ఇక ఆసీస్ ప్లేయర్ కెమరూన్ గ్రీన్, జేక్ ఫ్రేజర్ మెక్‌గార్క్, కివీస్ ప్లేయర్ డేవాన్ కాన్వే, సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై లిస్టులో ఉన్నారు. తాజాగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో అత్యధిక రన్స్ చేసిన కునాల్ చండేలా, వికెట్లు తీసిన అశోక్ కుమార్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌లో ఉన్నారు.

కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఈసారి ప్లేయర్ల కోసం 64.3 కోట్లతో వేలంలో పాల్గొననున్నది. అయిదు సార్లు టోర్నీ గెలిచిన చెన్నై జట్టు 43.4 కోట్లతో , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 25.5 కోట్ల పర్స్‌మనీతో వేలంలో పాల్గొననున్నాయి. ఈసారి వేలం కోసం 21 మంది ఇంగ్లండ్ క్రికెటర్లు పోటీపడుతున్నారు. వికెట్ కీపర్, బ్యాటర్ జేమీ స్మిత్, గస్ అట్కిన్‌సన్, లివింగ్‌స్టోన్, బెన్ డక్కెట్ రేసులో ఉన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన 19 మంది ఆటగాళ్లకు వేలంలో పాల్గొంటున్నారు. దాంట్లో గ్రీన్ టాప్ లిస్టులో ఉన్నారు. జోష్ ఇంగ్లిష్, షార్ట్, కూపర్ కొన్నలీ, వెబ్‌స్టర్ కూడా ఉన్నారు. 15 మంది దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో డీకాక్, మిల్లర్ ఉన్నారు. ఫాస్ట్ బౌలర్లు నోర్జె, లుంగి ఎంగిడి, గెరాల్డ్ కోయిట్జ్, ముల్డర్ ఉన్నారు. వెస్టిండీస్‌కు చెందిన అల్జరీ జోసెఫ్, షామర్ జోసెఫ్, అకీమ్ అగస్టీ, షాయ్ హోప్, రోస్టన్ చేజ్‌తో పాటు 9 మంది ఉన్నారు. శ్రీలంక క్రికెటర్లలో హసరంగ, దునిత్ వెల్లలగే, తీక్షణ, ట్రావీన్ మాథ్యూ, నిషాంక, కుశాల్ మెండిస్, పెరీరా ఉన్నారు. కాన్వే, రవీంద్రతో పాటు 16 మంది కివీస్ క్రికెటర్లు వేలంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన గుర్బాస్, నవీన్ ఉల్ హక్‌తో పాటు మొత్తం 19 మంది ప్లేయర్లు వేలం జాబితాలో ఉన్నారు.

# త్రీ ఇడియట్స్ సీక్వెల్ వచ్చేస్తుంది..

## అమీర్ ఖాన్- రాజ్ కుమార్ హిరానీ క్రేజీ రైడ్..!

**టాకీస్:** ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన కాంబోలో టాప్‌లో ఉంటుంది రాజ్ కుమార్ హిరానీ–అమీర్ ఖాన్. ఈ ఇద్దరి కాంబోలో వచ్చిన పీకే, త్రీఇడియట్స్ చిత్రాలు బాక్సాఫీస్‌ను ఏ రేంజ్‌లో షేక్ చేశాయో తెలిసిందే. కాలేజీ డ్రామా నేపథ్యంలో అమీర్ ఖాన్, మాధవన్, షర్మన్ జోషి లీడ్ రోల్స్‌లో నటించిన త్రీఇడియట్స్ చిత్రం ఐకానిక్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం




లేదు. ఈ క్రేజీ సెటైరికల్ కామెడీ డ్రామాకు సీక్వెల్ ఉండబోతుందంటూ వార్తలు వచ్చినా ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. అయితే త్రీ ఇడియట్స్ సీక్వెల్‌పైఅదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. స్క్రిప్ట్ ఫైనల్ అయింది. టీం చాలా ఎక్జయిటింగ్‌గా ఉంది. ఫస్ట్ పార్ట్ మ్యాజిక్ మళ్లీ రిపీట్ అవుతుందని వారంతా భావిస్తున్నారు. ఇందులో ఉన్న ఫన్, ఎమోషనల్, అర్థవంతమైన కథ, కథనం మళ్లీ బిగ్ స్క్రీన్‌పై రానుందని ఆశిస్తున్నారు. కథ కొనసాగనుండగా.. సుమారు 15 ఏండ్ల తర్వాత కథలోని పాత్రలు క్లైమాక్స్ సీన్‌లో (వారి వారి మార్గాల్లో ఉన్న వాళ్లు) మళ్లీ కలిసి కొత్త అడ్వెంచర్‌ను మొదలుపెడతాయని తాజా కథనం ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.

రాజ్ కుమార్ హిరానీ అమీర్ ఖాన్‌తో చేయబోయే దాదా సాహెబ్ ఫాల్కే బయోపిక్ నిలిచిపోవడంతో ఈ డైరెక్టర్ త్రీ ఇడియట్స్ సీక్వెల్‌పై ఫోకస్ పెట్టాడని బీటౌన్ సర్కిల్ సమాచారం. రాజ్ కుమార్ హిరానీ త్రీ ఇడియట్స్ సీక్వెల్‌ను పూర్తి స్థాయి స్క్రీన్ ప్లే ఉండేలా ప్లాన్ చేసుకున్నాడట. హిరానీ ఎప్పుడూ త్రీ ఇడియట్స్ సీక్వెల్ చేయాలనే ఆలోచన ఉంది. కానీ ఆయన ఒరిజినల్ (ఫస్ట్ పార్ట్) లెగసీని ఏ మాత్రం దెబ్బతీయకుండా పర్‌ఫెక్ట్‌గా ఉండాలనుకున్నాడని కథనం సారాంశం. మొత్తానికి ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా.. లేదా అనే రూల్‌ను రాజ్ కుమార్ హిరానీ పర్‌ఫెక్ట్‌గా ఫాలో అవుతున్నట్టు తాజా కథనం చెప్పకనే చెబుతోంది.



# ఉప్పెన తర్వాత వరుస ఫ్లాపులు

## ఆ టార్చర్‌తో సినిమాలు వదిలేయాలని అనుకున్న కృతి

**టాకీస్:** 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లో సంచలన ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి ఒక్కసారిగా స్టార్ రేంజ్‌ను అందుకుంది. బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన ప్యూర్ లవ్ ఎమోషనల్ డ్రామా దేశవ్యాప్తంగా హిట్ అవడంతో కృతి ఒక్క సినిమాతోనే 100 కోట్ల గ్రాస్ అందుకున్న అరుదైన హీరోయిన్‌గా మారింది. దీంతో టాలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి.అయితే ఉప్పెన స్థాయిలో ఆ తరువాతి సినిమాలు ఏదీ సక్సెస్ కాలేదు. 'ది వారియర్', 'మాచర్ల నియోజకవర్గం', 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి', ఇలా వచ్చిన చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విఫలం కావడంతో కృతి శెట్టిపై ట్రోలింగ్ తీవ్రంగా పెరిగింది. సోషల్ మీడియాలో 'ఐరన్ లెగ్', 'ఫ్లాప్ రాణి' వంటి ట్యాగులు తగిలించడంతో ఆమె మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైనట్లు తెలిపింది.

ప్రస్తుతం కార్తీ హీరోగా నటించిన 'వా వాతియార్' సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న కృతి, ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టాలను పంచుకుంది. నటనకి చాలా భావోద్వేగ శక్తి అవసరం. మనం ఎంత కష్టపడినా ఎలాంటి కారణం లేకుండా వచ్చే ద్వేషం, విమర్శలు భరించలేనివి. ఉప్పెన తర్వాత వచ్చిన ట్రోల్స్ వల్ల నేను తీవ్రంగా బాధపడ్డాను.ఒక దశలో 'నటననే ఆపేయాలా? అనిపించింది అని కృతి శెట్టి పేర్కొంది. అలాగే ఆమె తన ఆరోగ్యంపై ఆ సమయంలో పడిన ప్రభావాన్ని కూడా వెల్లడించింది. స్ట్రెస్ వల్ల జుట్టు రాలిపోవడం, చర్మ సమస్యలు వచ్చాయి. మా అమ్మానాన్నలూ భయపడ్డారు. చేయడం ఇష్టం లేకపోతే వదిలేయి అని చెప్పారు. కానీ ఉప్పెన నుంచి వచ్చిన ప్రేమ నన్ను నిలబెట్టింది అంటూ కృతి చెప్పిన ఈ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అనేక మంది నెటిజన్లు ఆమెను ధైర్యంగా నిలిచిందని ప్రశంసిస్తున్నారు. డౌన్‌ఫేజ్‌ను దాటుకున్న కృతి శెట్టి ఇప్పుడు మళ్లీ బలమైన ప్రాజెక్టులు చేసేందుకు సిద్ధమవుతోంది.కార్తీ నటించి వా వాతియర్ డిసెంబర్ 12న విడుద లకానుండగా, ప్రదీప్ రంగనాథన్ హీరో, విగ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ రెండు సినిమాలు కృతికి కంబ్యాక్‌గా మారతాయని అభిమానులు ఆశిస్తున్నారు.

MOVIE TIME

# విక్కీ కౌశల్‌కు జోడీగా దీపికా పదుకొణె?

## 'మహావతార్'లో పవర్ ఫుల్ రోల్!

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె తాజాగా మరో బంపరాఫర్ దక్కించుకున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే షారుఖ్ ఖాన్‌తో కింగ్ సినిమాతో పాటు అల్లు అర్జున్‌తో కలిసి అట్లీ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తుంది ఈ భామ. అయితే ఈ రెండు సినిమాలు కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో దీపిక భాగం





కాబోతున్నట్లు సమాచారం. 'స్త్రీ 2' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత దర్శకుడు అమర్ కౌశిక్ బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌తో కలిసి 'మహావతార్' అనే చిత్రాన్ని రూపొందించబోతున్న విషయం తెలిసిందే. మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాలో కథానాయికగా దీపికాను తీసుకోబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి సంప్రదింపులు జరుపగా దీపికా కూడా ఒకే చెప్పినట్లు తెలుస్తుంది.

పరశురాముడి జీవిత కథ ఆధారంగా రూపొందనున్న ఈ ప్రాజెక్ట్‌లో దీపికా పదుకొణె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని, ఆ పాత్రకు ఆమె వంద శాతం న్యాయం చేయగలరని చిత్ర యూనిట్ బలంగా విశ్వసిస్తోందట. అందుకే ఆమెను తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా గురించి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన దర్శకుడు అమర్ కౌశిక్, ఇప్పటికే ఆరు నెలల నుంచి ఈ ప్రాజెక్ట్ ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఇది తన కెరీర్‌లో అత్యంత ప్రత్యేకమైన సినిమా అవుతుందని పేర్కొన్నారు.

# 'స్పిరిట్'పై మరో ఆసక్తికర అప్‌డేట్..

## ప్రభాస్ ఎంట్రీ సాంగ్ వేరే లెవల్

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'స్పిరిట్' ప్రారంభం నుంచే అంచనాలను సొంతం చేసుకుంది. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' వంటి రా-ఇంటెన్సిటీ సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను ఏర్పరచుకున్న వంగా, ఈసారి ప్రభాస్‌ను పూర్తిగా భిన్నమైన యాక్షన్ డ్రామాలో చూపించబోతున్నాడు. ముఖ్యంగా ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారన్న విషయం అభిమానుల్లో అంచనాలు పెంచింది. తాజా సమాచారం ప్రకారం, 'స్పిరిట్' కోసం చిత్రబృందం అత్యంత భారీ పోలీస్ స్టేషన్ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది.



ఇది కేవలం సెట్‌గానే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించేలా ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నారని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరో ఎంట్రీలు ఎంత వైల్డ్‌గా ఉంటాయో తెలిసిందే. అదే స్థాయిలోనే ఈ సినిమాలో కూడా ప్రభాస్‌కు ఓ మైండ్-బ్లోయింగ్ పవర్‌ఫుల్ ఎంట్రీ ప్లాన్ చేసినట్టు టాక్. ఆసక్తికరమైన విషయం ఏంటంటే పోలీస్ స్టేషన్ సెట్‌లో ప్రభాస్ కోసం అదిరిపోయే ఎంట్రీ సాంగ్ చిత్రీకరించేందుకు సిద్ధమవుతున్నారు. కేవలం పాట మాత్రమే కాదు, అదే లొకేషన్‌లో భారీ స్థాయిలో యాక్షన్ ఎపిసోడ్‌లు కూడా ఉంటాయి. వంగా మార్క్ మేనరిజం, ఇంటెన్స్ సీన్స్, రా ఎనర్జీతో రూపొందే వీటి వల్ల థియేటర్లు బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్‌తో కేకలు పెట్టడం ఖాయమని అంటున్నారు సినీ విశ్లేషకులు.

ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ చేయని రీతిలో ఒక వైల్డ్, అగ్రెసివ్, రా పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. ఈ పాత్ర పూర్తిగా ఇంటెన్సిటీతో నిండిపోయి, వంగా ప్రత్యేక టచ్‌తో మరో లెవెల్‌లో రూపొందుతోంది. అటు సెట్ డిజైన్ నుంచి, లైటింగ్ వరకు అన్నీ డార్క్, రియలిస్టిక్ టోన్‌లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారట. ఇప్పటికే 'స్పిరిట్' పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరిగింది. 'స్పిరిట్' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నప్పటికీ, ప్రతి అప్‌డేట్ సినిమాపై అంచనాలను సరికొత్త స్థాయికి తీసుకెళ్తోంది. ప్రభాస్–వంగా కాంబో నుంచి ప్రేక్షకులు భారీ స్థాయి ఎమోషన్, వైలెన్స్, మాస్ ఎలిమెంట్స్‌ను ఆశిస్తున్నారు. ముఖ్యంగా కొత్త పోలీస్ అవతారంలో ప్రభాస్ ఎలా అలరిస్తాడన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# వి. శాంతారామ్ బయోపిక్‌లో హీరోయిన్‌గా తమన్నా..

## ఫస్ట్‌లుక్ రిలీజ్

**టాకీస్:** భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన పేరు, సుప్రసిద్ధ దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన దిగ్గజ చలనచిత్రకారుడు వి. శాంతారామ్ జీవితం ఇప్పుడు వెండితెరపై ఆవిష్కృతం కానుంది. ఆయన అద్భుతమైన సినీ ప్రయాణం ఆధారంగా బాలీవుడ్‌లో ఒక భారీ బయోపిక్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ బయోగ్రాఫికల్ డ్రామాకు ఆయన పేరునే 'వి. శాంతారామ్'గా ఖరారు చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో టైటిల్ పాత్ర (వి. శాంతారామ్ పాత్ర)లో ప్రముఖ బాలీవుడ్ యువ నటుడు సిద్దాంత్ చతుర్వేది నటించబోతుండగా.. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే మూవీ నుంచి సిద్దాంత్ చతుర్వేది ఫస్ట్ లుక్‌ని విడుదల చిత్రబృందం తాజాగా కథానాయికను పరిచయం చేసింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా తమన్నా భాటియా ఫస్ట్‌లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ బయోపిక్‌ను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే మరియు సరిత అశ్విన్ వర్దే సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వి. శాంతారామ్ యొక్క అద్భుతమైన సినీ ప్రయాణాన్ని చూపించనుంది. సైలెంట్ యుగం (మూకీ సినిమాల కాలం) నుంచి టాకీలు (శబ్దంతో కూడిన సినిమాలు) ఆపై కలర్ సినిమా యుగం వరకు ఆయన చేసిన కృషి, దర్శకుడిగా, నిర్మాతగా ఆయన ఘనమైన ప్రస్థానాన్ని ఈ చిత్రం తెరకెక్కించనుంది.

శాంతారామ్ సినీ ప్రస్థానం

1901 నవంబర్ 18, 1901లో మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జన్మించిన వి. శాంతారామ్ 1921లో నటుడిగా వెండితెరపై అడుగుపెట్టాడు. అనంతరం నటనతో పాటు మొత్తం 55కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించాడు. ప్రభాత్ ఫిల్మ్ కంపెనీ (1929), రాజ్‌కమల్ కళామందిర్ (1942) లాంటి సంస్థలు స్థాపించి 92 సినిమాలకు పైగా నిర్మాతగా వ్యవహరించాడు. శాంతారామ్ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం అతడిని దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1985), పద్మవిభూషణ్ (1992 మరణానంతరం) లతో సత్కరించింది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.